సాక్షి ప్రకాశం

శనివారం । 22 । జూన్ । 2024



రైతు బజార్లలో కూరగాయలు

కూరగాయలు పండించే రైతులు కూడా రైతుబజార్లలో వాటిని విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జేసీ గోపాలకృష్ణ అన్నారు.

- 8లో..



పొగాకు సాగు పెంచొద్దు

ప్రత్యేక పరిస్థితుల్లో ఈ ఏడాది పొగాకు ధరలు బాగున్నాయని, అలాగని సాగు పెంచొద్దని పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

39.2/31.2

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు ఒంగోలులో ఒలింపిక్ రన్

ఒంగోలు: ప్రకాశం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న స్థానిక ప్రకాశం భవనం వద్ద నుంచి మినీ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, బొడ్డు సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. జిల్లాలోని 40కిపైగా ఉన్న ఒలింపిక్ అసోసియేషన్ అనుబంధ సంఘాలు, క్రీడాకారులు, క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, క్రీడాభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కాచి వడపోసిన నీటినే తాగాలి

- డీఎంహెచ్‌ఓ డా.సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమై అతిసార, రక్త విరేచనాలు, టైఫాయిడ్ వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నందును కాచి వడపోసిన నీటిని తాగాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ సూచించారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. అతిసారలో రెండు కానీ అంతకు మించి కాని నీళ్ల విరేచనాలు కావడం, శరీరంలోని సూక్ష్మ పోషకాలు తగ్గిపోవడం వలన శక్తి సన్నగిల్లుతుందన్నారు. 0 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆశా కార్యకర్తలను, ఏఎన్‌ఎంలకు తెలియజేయాలన్నారు. వారి సూచనల ప్రకారం ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలని, అప్పటికీ విరేచనాలు తగ్గకపోతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కానీ, ఏరియా వైద్యశాలలో కానీ సంప్రదించి సత్వర వైద్య చికిత్స తీసుకోవాలని తెలిపారు. అతిసార రాకుండా పిల్లలు, పెద్దలు తగిన జాగ్రతలు పాటించాలని కోరారు. భోజనం ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, ఈగలు వాలిన తినుబండరాలను తినరాదన్నారు. ఆహారంపై మూతలు ఉంచాలని, క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగలని సూచించారు. వ్యర్థ పదార్థాలను గృహసముదాయాలకు దూరంగా పారేయాలని, మరుగుదొడ్డి వాడిన తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు.

సాగు సాయం ఏదీ..

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయంగా రైతు భరోసా నగదు క్రమం తప్పకుండా అందగా.. కొత్త ప్రభుత్వంలో ఇంత వరకు ఆ దిశగా అడుగులు పడలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయం రైతుల అకౌంట్లలో పడగా.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా నగదు ఊసే లేదు. దీంతో అప్పులు చేసి సాగుచేయాల్సిన స్థితిలో ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

- నేడు ఏరువాక పౌర్ణమి
- ఖరీఫ్ సాగుకు అందని పెట్టుబడి భరోసా
- గత ప్రభుత్వంలో 2,95,584 మంది రైతులకు రూ.1820.902 కోట్ల అందజేత
- 2,42,851 రైతుల ఖాతాలకు రూ.48.57 కోట్ల పీఎం కిసాన్ మొత్తం జమ
- పెట్టుబడి సాయంపై నేటికీ ప్రకటించని కొత్త ప్రభుత్వం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఎదురు చూస్తున్న రైతాంగం
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా నిధులు ఒకేసారి
- జిల్లాలో ఖరీఫ్‌లో 1,38,877 హెక్టార్లలో కానున్న సాగు



ముండ్లమూరు మండలంలో మెట్టభూముల్లో విత్తనాలు విత్తుతున్న రైతులు

ఒంగోలు సెంట్రల్:

అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. నేడు ఏరువాక పౌర్ణమి కావటంతో రైతన్నలు తమ పశువులకు, వ్యవసాయ పనిముట్లకు ప్రత్యేక పూజలు చేసి పనులు మొదలు పెట్టేందుకు సమాయత్తమయ్యారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయంగా రైతు ఖాతాల్లోకి రూ.2 వేలు చొప్పున జమ చేసింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల కొనుగోలుకు ఈ మొత్తం కాస్త సహాయ పడుతుంది. జిల్లాలో 2,42,851 మంది రైతులకు రూ.48.57 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఈ మొత్తం కేంద్ర వాటా కాగా.. రాష్ట్ర ప్రభుత్వం చేసే సహాయం కోసం రైతాంగం ఎదురు చూస్తోంది.



కొనకనమిట్లలో నిర్వహిస్తున్న ఏరువాక కార్యక్రమం

నాడు ఆరంభంలోనే పెట్టుబడి సాయం:

సాగు పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సమ్మాన్) అందిస్తూ వారికి అండగా నిలిచేవారు. పీఎం కిసాన్ సాయం రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభం, కోతల సమయం, రబీ ఆరంభంలో గానీ, ధాన్యం ఇంటికి చేరే వేళ గానీ మూడు విడతలుగా అందించేవారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఐదేళ్లలో జిల్లాలోని 2,95,585 మంది రైతులకు రూ.1820.902 కోట్లు అందించారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించగా.. ఎటువంటి భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు భూములను సేద్యం చేస్తున్న కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అందించేది. ఏటా మే నెలలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ తొలి విడత సాయం విడుదల చేసేది. దాంతో పాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని రైతుల ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేసేవారు. ఎన్నికల కారణంగా ఈ ఏడాది ఆలస్యమైంది. సన్న, చిన్నకారు రైతులకు ఈ సాయం ఎంతగానో ఉపయోగపడేది.

అప్పులతోనే ప్రారంభం


జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 1,38,877 హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతాయి. ఈ సంవత్సరం ఖరీఫ్ రైతన్నలకు అప్పులతో ప్రారంభమవుతోంది. రైతు పంట పండించేందుకు ఎకరానికి కనీసం రూ.13 వేల వరకు పెట్టుబడి అవసరం. భూమిని సిద్ధం చేయటానికి ట్రాక్టర్ దుక్కులు, విత్తనాలకు, కూలీలకు, పంట సాగుకు, మందులకు అవసరమవుతాయి. వరి సాగు చేసే రైతులకు నారుమడి వద్ద నుంచి నాట్ల వరకు నగదుతోనే నడుస్తుంది. గతంలో ప్రభుత్వం కొంత సొమ్మును జమ చేస్తే మిగిలిన సొమ్ము పాడితోపాటు వచ్చే ఆదాయంలో పంటలు సాగు చేసేవారు. నేడు రైతు పెట్టుబడులకు చేతిలో సొమ్ములేక అప్పులపాలవుతున్నారు.

రాష్ట్ర సాయం కోసం ఎదురు చూపులు

రైతులు ఖరీఫ్ పనులు ప్రారంభం కావటంతో విత్తనాలు, నారుమడుల తయారీకి రైతులకు సొమ్ములు అవసరం అవుతున్నాయి. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా ఒకే సారి అందటంతో పెట్టుబడి కింద ఆ మొత్తం ఉపయోగపడుతుంది. ఇప్పుడు రూ.2 వేలు మాత్రమే అందటంతో ఎటూ చాలదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము రైతులకు రూ.20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. కానీ రైతుపెట్టుబడి సాయంపై సంతకం లేదు, ప్రకటన లేదు. అసలే వ్యవసాయం దండుగ అన్న ప్రభుత్వం తమను ఏం చేస్తుందో అని రైతన్న ఎదురు చూస్తున్నారు.



తాళ్లూరు మండలంలో ఖరీఫ్‌లో సాగు చేసిన వరి



నాట్లకు సిద్ధంగా ఉన్న వరి నారు

యోగాసనాలతో మంచి నడవడిక



యోగాసనాలు చేస్తున్న ఎస్పీ , కలెక్టర్, జైలు సూపరింటెండెంట్



అలరించిన యోగా

- జిల్లా జైలులో యోగాసనాలు చేసిన కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు టౌన్: ప్రతి రోజూ యోగాసనాలు చేయడం వలన మంచి నడవడికతోపాటు ఆత్మ స్థైర్యం పెంపొందుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. జిల్లా జైలులో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఎస్పీ సుమిత్ సునీల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వలన జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు నిత్యం యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేయడం వలన నడతలో మార్పు వస్తుందని, తదనంతర జీవితంలో బాధ్యత కలిగిన వ్యక్తిగా మసలుకొనే అవకాశం ఉంటుందన్నారు. పదేళ్లుగా నిర్వహిస్తున్న యోగా డేను ఈ ఏడాది స్వయం, సమాజం కోసం యోగా అనే నినాదంతో నిర్వహిస్తారన్నారు. లైఫ్ ఛేంజ్ మూవ్‌మెంట్‌గా యోగాను పరిగణలోకి తీసుకొని దైనందిన జీవితంలో రోజూ సాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల 3200 మంది స్కూలు విద్యార్థులతో విరామం లేకుండా గంటా 45 నిమిషాల పాటు 108 సార్లు సూర్య నమస్కారాలు చేయడం ద్వారా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు సాధిస్తారని వివరించారు. యోగాసనాల వలన సానుకూల దృక్పథం ఏర్పడుతుందని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ చెప్పారు. ప్రతికూల భావనలను అడ్డుకట్ట వేసేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జైలు జీవితంలో ప్రతి రోజూ యోగా చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా తదనంతరం సమాజానికి ఉపయోగపడేలా జీవనం కొనసాగించవచ్చని సూచించారు. 10వ అంతర్జాతీయ యోగా డేను జిల్లా జైలులో నిర్వహించడం వలన ఖైదీల్లో ఉత్సాహం కనిపిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకొని ఖైదీలు యోగా సాధన చేయడం సంతోషం కలిగించిందని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి అన్నారు. ఖైదీలలో మానసిక మార్పు కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. తొలుత ఖైదీలతో కలిసి కలెక్టర్, ఎస్పీలు యోగాసనాలు చేశారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జైలర్ రమేష్, ఆయుష్ ఆర్డీడీ డాక్టర్ పద్మాజాతి, ఎస్‌ఎంఓ డాక్టర్ భ్రమరాంబ, డాక్టర్ చైతన్య వర్మ, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భీమ్‌నాథ్, ఎంఈఓ కిశోర్ బాబు, ఒంగోలు డీఎస్పీ కిశోర్ బాబు, టూటౌన్ సీఐ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం యోగా గురువు పతంజలి శ్రీనివాస్‌ను కలెక్టర్ సత్కరించారు.



పెద్ద సంఖ్యలో యోగాసనాలు చేస్తున్న సిబ్బంది, ఖైదీలు

భావితరం భవిష్యత్తు మీ చేతిలో..

- రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల

ఒంగోలు: భావితరం భవిష్యత్తు మీ చేతిలో ఉంటుందని, డ్రైవర్లు పూర్తిస్థాయిలో డ్రైవింగ్ నైపుణ్యం కలిగి ఉండాలని విద్యాసంస్థల బస్సుల డ్రైవర్లకు రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల సూచించారు. స్థానిక రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం స్కూలు, కాలేజీ బస్సుల డ్రైవర్లకు అవగాహన సదస్సు, కంటి పరీక్ష, రక్త పరీక్షలతోపాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులతో స్నేహపూర్వక వాతావరణంతోపాటు తమ బిడ్డల పట్ల ఎలా మంచి మర్యాదతో ఉంటారో బస్సులో ఎక్కే ప్రతి విద్యార్థి పట్ల కూడా అదే దృక్పథాన్ని కలిగి ఉండాలన్నారు. బస్సులో అటెండెంట్ బాధ్యతను గమనిస్తూ డ్రైవర్ బస్సును నడపాలన్నారు. బస్సులో కెపాసిటీకి తగ్గట్లుగా విద్యార్థులను ఎక్కించుకోవాలన్నారు. 5 సంవత్సరాల అనుభవం లేని వారు బస్సులను నడపడం నేరం అనే విషయం తెలుసుకోవాలన్నారు. 60 ఏళ్లు దాటిన వారు కూడా బస్సులు నడపరాదన్నారు. బస్సుల్లో ర్యాంకులు ఉండాలని, బస్సు ఇండికేషన్లు కూడా తప్పక వినియోగంలో ఉండాలన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో 1540 బస్సులకు గాను ఇంకా 742 బస్సులకు ఫిట్‌నెస్ చేయాల్సి ఉందన్నారు. అయితే వాటిలో చాలా బస్సులు 15 సంవత్సరాల కాలపరిమితి ముగిసి రన్నింగ్‌లో లేనివి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్ ప్రభాకర్, రామచంద్రరావు, రవి నాయక్, సురేంద్ర, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్కూలు, కాలేజీ బస్సు డ్రైవర్లకు అవగాహన కలిగిస్తున్న రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల

తెలుగు రాష్ట్రాల స్థాయి పశుప్రదర్శన

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన గొర్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా 24, 25, 26వ తేదీల్లో తెలుగు రాష్ట్రాల స్థాయి పశుప్రదర్శన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 24న ఆరుపండ్ల సైజు విభాగం మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.35 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, 25న న్యూకేటగిరీ విభాగంలో మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, 26న సీనియర్ విభాగంలో మొదటి నుంచి ఐదు బహుమతులు వరుసగా రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు దాతలు ప్రకటించినట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ 9959132286, 9959479659, 9642635212 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులకు గిట్టుబాటుగా పొగాకు ధరలు

- పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్ బాబు
- పొగాకు ధర గరిష్టంగా రూ.339

ఒంగోలు సెంట్రల్: పొగాకు ధరలు ఈ సంవత్సరం రైతులకు గిట్టుబాటుగా ఉన్నట్లు పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అద్దంకి శ్రీధర్ బాబు అన్నారు. ఒంగోలు-2 పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన, బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్, ఆర్‌ఎం లక్ష్మణరావుతో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ పొగాకు చెక్కులను పరిశీలించి రైతులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు సరాసరి రూ.251 పలకటం రైతులకు సంతోషకరమైన విషయం అని అన్నారు. రీజియన్ పరిధిలో పొగాకు ధర శుక్రవారం గరిష్టంగా రూ.339 పలికిందని ఆర్‌ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలో 8221 బేళ్లు రాగా, 7621 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. 600 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. అందులో ఒంగోలు, కొండపి కేంద్రాల్లో 86వ రోజు వేలం పాటలో కేజీ గరిష్టంగా రూ.339, కనిష్టంగా రూ.204, సరాసరి రూ.293 వచ్చింది. డీసీపల్లి, కలిగిరి, కందుకూరు-2, ఒంగోలు-2, వెల్లంపల్లి, పొదిలి, కనిగిరి కేంద్రాల్లో 81వ రోజు వేలం పాటలో గరిష్టంగా రూ.336, కనిష్టంగా రూ.205, సరాసరి రూ.249.26 వచ్చినట్లు ఆర్‌ఎం వివరించారు.

గరుడ వాహనంపై నారశింహుడు



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన నారశింహుడు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం హనుమంతవాహనంపై, శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. నరశింహస్వామిని గరుడ వాహనంపై ప్రత్యేకంగా అలంకరించి సోమరాజుపల్లి గ్రామం వరకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం స్వామివారు గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు వివరించారు. ఉత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రాష్ట్రస్థాయి రాదాడు పోటీలు:

పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరశింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీ కృష్ణ యాదవ్ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాదాడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 6 జిల్లాలకు చెందిన 18 జతల ఎడ్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు వివరించారు. ఈ పోటీలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



దర్శిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న తాటిపర్తి చంద్రశేఖర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దర్శి/యర్రగొండపాలెం: దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ శ్రేణులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. దర్శిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గడియార స్తంభం సెంటర్లో బాణసంచాపేల్చి తమ ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీ కార్యాలయంలో సంబరాలు చేసుకుని శివప్రసాదరెడ్డికి ప్రమాణ స్వీకార మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.



దర్శిలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

పొగాకు సాగు పెంచొద్దు

● పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు

ఒంగోలు సెంట్రల్: ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఈ సంవత్సరం పొగాకు ధరలు బాగున్నాయని, అలాగని, పొగాకు అత్యధికంగా సాగు చేసి ఇబ్బందులు పడవద్దని పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు రైతులకు సూచించారు. ఒంగోలు–2 పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించారు. అనంతరం ఆర్‌ఎం లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన ఏరువాక పౌర్ణమి రైతు పూజోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది వేలం ప్రారంభం నుంచి పొగాకుకు మంచి ధరలు రావడం సంతోషకరమని అన్నారు. ఇప్పటి వరకు సరాసరి ధర రూ.251.00 వచ్చిందన్నారు. పొగాకు రైతులతో తనకున్న సంబంధాన్ని గుర్తు చేసుకుని వారికి సేవ చేసే అవకాశం రావడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులను ప్రతి ఒక్క పొగాకు రైతు సాగు చేసి భూమి సారాన్ని పెంచాలని సూచించారు. గత సంవత్సరం వలే ఎలాంటి రుసుం లేకుండా రైతుల నుంచి అదనపు పొగాకు కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. రైతులు తమకు కావాల్సిన సౌకర్యాలను పోరాడి సాధించుకోవాలని చెప్పారు. ఉత్తమ రైతులను సన్మానించారు. ఆర్‌ఎం లక్ష్మణరావు, విస్తరణాధికారి దామోదర్, ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ, వేలం నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్, ఐటీసీ ప్రతినిధి ప్రవీణ్, జీపీఐ ప్రతినిధి ప్రభాకర్, బోర్డు సభ్యులు వరప్రసాద్, మాజీ ఆర్‌ఎంలు ఉమామహేశ్వరరావు, బాబూరావు, రైతు నాయకులు వద్దెళ్ల ప్రసాద్, దేవబత్తిన వెంకన్న, సునీల్, వై.వెంకట శేషయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొక్కలు నాటారు.

మాజీ ఎమ్మెల్యే బుర్రాకు మాతృవియోగం

● వృద్ధాప్య సమస్యలతో కన్నుమూసిన లక్ష్మమ్మ



బుర్రా లక్ష్మమ్మ (ఫైల్)

కందుకూరు: కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ మాతృమూర్తి బుర్రా లక్ష్మమ్మ శుక్రవారం కన్నుమూశారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆమె శుక్రవారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం బుర్రా స్వగ్రామం టంగుటూరు మండలం శివపురంలోని ఇంటి వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు బుర్రా కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బుర్రా లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.


అజొల్లా.. మేత వెతలు తీర్చేలా..



అజొల్లా చల్లకం ఇలా



అజొల్లా పెంపకం చేపట్టే తొట్టి



అజొల్లా

● అజొల్లా సాగుతో ఎంతో ఉపయోగం
● పశుగ్రాసం కొరత తీరే అవకాశం

కొనకనమిట్ల: పాడి పరిశ్రమలో పశుదాణాకు ఎంతో ప్రాధాన్యత ఉంది. పశువులకు దాణా ఎంతో ముఖ్యం. పశుదాణాలో వాడే వేరుశనగ చెక్క, పత్తి చెక్కలు ఖర్చుతో కూడుకున్నవి. పశుపోషకులు ఖర్చులు తగ్గించుకొనేందుకు ప్రత్యామ్నాయంగా 25 శాతం ప్రొటీన్లు గల అజొల్లా వాడకం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. రైతులు తమ పశువులకు దాణాగా ఉపయోగించుకునేందుకు అజొల్లా సాగు చేసుకుంటే రోజువారీగా వాడుకోవచ్చు. అజొల్లా సాగు చేసుకునే విధానాన్ని పశు వైద్యాధికారులు శ్రీకాంత్‌రెడ్డి, వి.రాజ్యలక్ష్మి రైతులకు వివరించారు.

అజొల్లా.. సాగు చేయండిలా..

అజొల్లా అనేది ఆకుపచ్చ ఫెర్న్ జాతికి చెందిన మొక్క ఇది నీటి మీద తేలుతుంది. ఎండబెట్టిన అజొల్లా పొడిలో 25 నుంచి 35 శాతం మాంసకృత్తులు, 10 నుంచి 15 శాతం మినరల్స్, కెరోటిన్, బి–12 విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. తక్కువ లిగ్నిన్ ఉండటం వల్ల పశువులు తేలికగా జీర్ణం చేసుకుంటాయి. అజొల్లా వాడిన పశువుల్లో పాల దిగుబడి పెరుగుతుంది. అజొల్లాను దాణాగా వాడటం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు వెన్న శాతం, ఎస్.ఎన్.ఎఫ్ పెరుగుతుంది. పశువులతోపాటు అజొల్లాను గొర్రెలు, మేకలు, పందులు, కుందేళ్లు, కోళ్లు ఈము పక్షులుకు ఉపయోగించవచ్చు.

అజొల్లా ఉత్పత్తి

రోజూ 4 కిలోల మేర అజొల్లా ఉత్పత్తి చేసేందుకు 2.25+1.5 మీటర్ల పొడవు, 10 సెం.మీ ఎత్తు ఉండేలా మూడు తొట్లు తయారు చేసుకోవాలి. తొట్టిలో 150 జీఎస్‌ఎం మందం గల సిల్పాలిన్ షీట్ వేసి, ఇటుకల పైఅంచుల వరకు ఉండేలా చూసుకోవాలి. తరువాత 35 కిలోల భూసారం గల మట్టిని జల్లెడ పట్టి షీట్ మీద గోతిలో పరచాలి. 45 కిలోల నిల్వ ఉంచిన పశువుల పేడను 20 లీటర్ల నీటిలో కలిపి దానిలో కొంత మినరల్ మిక్చర్‌ను కలిపి తొట్టిలో వేయాలి. మట్టి, పేడ కలిసేలా తిప్పాలి. తరువాత 2 కిలోల తాజా మదర్ కల్చర్ అజొల్లాను బెడ్ మీద సమానంగా పడేలా చల్లాలి. పైన మంచి నీటిని చిలకాలి. వారం రోజుల్లో అజొల్లా తొట్టి అంతటా పాచిలా పాకుతుంది. కిలో అజొల్లా నుంచి వారం పది రోజుల్లో 10 కిలోల వరకు దిగుబడి వస్తుంది. రోజూ కొంత తీసి పశువులకు దాణాగా వాడుకోవచ్చు. వారానికి ఒకసారి పేడ, మినరల్ మిక్చర్ కలిపి అజొల్లా తొట్టిలో వేస్తుండాలి. నీటిని మారుస్తూ ఉండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అజొల్లా పెంపకం తొట్టిలో నేరుగా సూర్యకాంతి పడకుండా, ఆకులు పడకుండా చూడాలి. ఆకులు పడితే అజొల్లా కుళ్లి పోయే ప్రమాదం ఉంది. పది రోజులకొకసారి నీటిని మారుస్తూ ఉండాలి. 60 రోజులకొకసారి మట్టిని తీసి కొత్త మట్టిని వాడాలి. ప్రతి ఆరు నెలలకొకసారి మట్టి, నీరు, అజొల్లాను తొలగించి, కొత్తగా తయారు చేసిన నీటిని, మట్టిని, అజొల్లాను వాడాలి.

విద్యార్థుల ఉజ్వల భవిత మీ చేతుల్లోనే..

● హెచ్‌ఎంల సమావేశంలో డీఈఓ సుభద్ర



మాట్లాడుతున్న డీఈఓ సుభద్ర

మార్కాపురం టౌన్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని డీఈఓ డి.సుభద్ర పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. హెచ్‌ఎంలు ప్రణాళిక ప్రకారం విద్యార్థుల సమగ్ర వికాసానికి, తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పాఠశాల నిర్వాహణ, రికార్డుల తయారీలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల గుణాత్మక మార్పునకు పాఠశాలలు వేదిక కావాలన్నారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రమౌళీశ్వర్, డీసీఈబీ సెక్రటరీ వెంకటరావు, హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డితోపాటు అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, కేజీబీవీ, మోడల్ స్కూల్, సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆరుగురు అటెండర్లకు టైపిస్టులుగా పదోన్నతి

ఒంగోలు అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో అటెండర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆరుగురికి టైపిస్టులుగా పదోన్నతి కల్పించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా వారికి పదోన్నతి పత్రాలు అందజేశారు. పదోన్నతి పొందిన ఉద్యోగులను అభినందించిన కలెక్టర్.. నైపుణ్యంతో బాధ్యతలు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఇన్‌చార్జ్ ఏఓ మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయలు

● జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ



కూరగాయల అమ్మకాలపై సమావేశం నిర్వహిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: కూరగాయలు పండించే రైతులు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా రైతు బజార్లలో కూరగాయలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సూచించారు. కూరగాయల ధరలు అధికంగా పెరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం టమోటా ధరలు అధికంగా పెరగడం వలన చిత్తూరు జిల్లాలోని మార్కెట్ల నుంచి ధరల స్థిరీకరణ నిధిని ఉపయోగించి దిగుమతి చేసుకోవాలన్నారు. లాభనష్టాలు లేని విధంగా రైతు బజార్లలో ప్రజలకు విక్రయించాలన్నారు. కూరగాయల కొరతను కృత్రిమంగా సృష్టించి నిల్వ చేసి ధరలు పెంచే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తూనికలు, కొలతల శాఖతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, సివిల్ సప్లయిస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి...

పేదలకు పంపిణీ చేసే రేషన్ సరుకులు కల్తీ లేకుండా కచ్చితమైన తూకంతో ఉండాలని, బియ్యం, కందిపప్పు, నూనెలు నాణ్యంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను సందర్శించి రేషన్ సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యతతో పాటు వాటి పరిమాణం కూడా నిబంధనల మేరకు ఉండాలన్నారు. సరుకుల నిల్వకు సంబంధించిన రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, సివిల్ సప్లయిస్ జనరల్ మేనేజర్ సత్యనారాయణ, తూనికలు, కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జూలై 7న మాదిగల జన జాతర సభ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఒంగోలు సెంట్రల్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పడి 30 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా మాదిగల జన జాతర సభను జూలై 7వ తేదీ ఈదుమూడిలో నిర్వహించనున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు కొమ్మూరి గరటయ్య మాదిగ తెలిపారు. ఒంగోలు అంబేద్కర్ భవన్‌లో ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ రావినూతల కోటి మాదిగ అధ్యక్షతన శుక్రవారం ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కొమ్మూరి గరటయ్య మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మూడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్ ఉద్యమ చరిత్రను వివరించారు. జూలై 7 నాటికి మూడు దశాబ్దాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈదుమూడిలో ఎంఆర్‌పీఎస్ స్థూపాన్ని సందర్శించుకుని ఎంఆర్‌పీఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు పెటేటి సుభాష్ చంద్రబోస్ మాదిగ, పత్తిపాటి నాగయ్య మాదిగ, బక్కరాజు మాదిగ, గౌడు పేరు కృష్ణ మాదిగ, మల్లేల ప్రసాద్ మాదిగ, సతానేయులు మాదిగ, నాగార్జున మాదిగ, సురేష్ మాదిగ, సీమోను మాదిగ, సుధాకర్ మాదిగ, రాజేష్ మాదిగ, వెంగబాబు మాదిగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మాదిగల జన జాతర సభ కరపత్రాలు విడుదల చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



బ్రహ్మయ్య మృతదేహం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ మోహనరావు

తాళ్లూరు (ముండ్లమూరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం వద్ద శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... దర్శి మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామానికి చెందిన ముత్తుకూరి బ్రహ్మయ్య (40) కొరిశపాడు మండలం మేదరమెట్లలో బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం స్వగ్రామంలో ఉన్న తల్లిదండ్రులను చూసేందుకు ద్విచక్ర వాహనంపై చెరువుకొమ్ముపాలెం వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి మేదరమెట్ల వెళ్తూ మార్గం మధ్యలో తూర్పుగంగవరం మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీని మధ్య భాగంలో ఢీకొట్టాడు. దీంతో బ్రహ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కి సమాచారం ఇచ్చి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రహ్మయ్య మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ మోహనరావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. మృతుడికి భార్య సామ్రాజ్యం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య సామ్రాజ్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మోహనరావు తెలిపారు.

విద్యుత్ ఏడీ కార్యాలయం ఎదుట నిరసన

గిద్దలూరు రూరల్: రాచర్ల మండలం ఒద్దులవాగుపల్లె గ్రామంలో ఈ నెల 19వ తేదీన జేఎల్‌ఎం సురేష్‌నాయక్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కాలు, చేయి తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సమాచారం. జేఎల్‌ఎం బంధువులు తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం గిద్దలూరు పట్టణంలోని ఏడీఈ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. జేఎల్‌ఎంకు అన్ని విధాలా న్యాయం చేయాలని ఏడీఈ శేషగిరిరావును కోరారు. సమాచారం అందుకున్న సీఐ వైవీ సోమయ్య సంఘటనా స్థలం వద్దకు చేరుకుని జేఎల్‌ఎం బంధువులతో మాట్లాడి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు.

ఫారెస్ట్ కన్జర్వేటర్ ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు రూరల్: స్థానిక అటవీశాఖ కార్యాలయాన్ని ఫారెస్ట్ కన్జర్వేటర్ డీఎస్ మూర్తి శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గిద్దలూరు అటవీ శాఖ పరిధిలోని గుండ్లకమ్మ రేంజ్, తురిమెళ్ల రేంజ్, గిద్దలూరు రేంజ్ పరిధిలోని రేంజ్ ఆఫీసర్లు తమ పరిధిలోని రికార్డులు సమర్పించారు. అభయారణ్య ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ అధికారులు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఫారెస్ట్ కన్జర్వేటర్ ఆరా తీశారు. ఆయన వెంట డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు, సబ్ డీఎఫ్ఓ శ్రీకాంత్‌రెడ్డి, రేంజ్ ఆఫీసర్లు కుమార్‌రాజ, జీవన్‌కుమార్, సౌజన్య తదితరులు ఉన్నారు.